సంక్షోభ హాస్టళ్లు

సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులను కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. తీవ్ర వసతుల కొరత వేధిస్తున్నా.. ఇవేవీ ప్రజాప్రతినిధులకు పట్టడం లేదు. వసతుల లేమితో అనేక హాస్టళ్లలో విద్యార్థుల చేరిక లేకపోవడంతో ఇప్పటికే కొన్నింటిని మూసివేశారు. మిగిలిన వాటిని కూడా మూసివేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

- శిథిల భవనాల్లో వెళ్లదీస్తున్న విద్యార్థులు
- మరుగుదొడ్లు నిరుపయోగం
- కనీస వసతులు మృగ్యం
- కొరవడిన పర్యవేక్షణ



నరుకూరులో శిథిల భవనంలో నిద్రిస్తున్న విద్యార్థులు

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు మొత్తం 18 ఉన్నాయి. వెంకటాచలం మండలం చెముడుగుంట, సర్వేపల్లి హాస్టళ్లలో విద్యార్థులు చేరకపోవడంతో హాస్టళ్లను మూసివేశారు. పొదలకూరు మండలంలో ఎస్సీ, బీసీ హాస్టళ్లు 8 ఉండగా పొదలకూరు ఎస్సీ బాలికల హాస్టల్‌కు సొంతభవనం లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే మండలం మహ్మదాపురంలో దొడ్ల డెయిరీ వారు సీఎస్సార్ ఫండ్స్‌లో హాస్టల్ భవనాలను చక్కగా నిర్మించారు. ముత్తుకూరులో సంక్షేమ హాస్టల్ ఒక్కటి ఉండగా తొలగించారు. తోటపల్లిగూడూరు మండలం చిన్నచెరుకూరు, తోటపల్లిగూడూరు గ్రామాల్లో మొత్తం 4 హాస్టళ్లు ఉన్నాయి. కనీస వసతులు కూడా లేకుండా పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలుతాయోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. పర్యవేక్షణ కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

బిక్కుబిక్కుమంటూ

తోటపల్లిగూడూరు మండలం నరుకూరు హాస్టల్ భవనంలో విద్యార్థులు భయం గుప్పెట్లో కాలం వెళ్లదీస్తున్నారు. శిథిల భవనం కావడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భీతిల్లుతున్నారు. పొదలకూరు మండల కేంద్రం ఎస్సీ బాలికల వసతిగృహం దుస్థితిలో ఉంది. సొంతభవనం లేకపోవడంతో శిథిలావస్థలో ఉన్న పాత ఎంపీడీఓ కార్యాలయ భవనంలో పిల్లలు తలదాచుకుంటున్నారు. ఒకే హాలులో అందరు స్టడీకి కూర్చుని అక్కడే నిద్రించాలి. 70 మందికి ఐదు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. ఇక్కడ పిల్లలు ఆరుబయటే దుస్తులు ఉతుక్కోవాలి. మెయిన్‌రోడ్డుకు ఆనుకుని ఉన్న పాత ఎంపీడీఓ కార్యాలయ భవనం ప్రహరీ కూలిపోయి ఉంది. ముత్తుకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో 640 మంది విద్యార్థినులు చదువుకొంటున్నారు. శుభ్రమైన వాతావరణంలో భోజనాలు తయారు చేస్తున్నప్పటికీ చిన్న తరగతుల విద్యార్థినులు కటిక నేలపై కూర్చుని భోజనం చేయాల్సిన దుస్థితి నెలకొంది. మనుబోలులో ఎస్సీ బాలుర, బాలికల హాస్టళ్లు, బద్దెవోలులో బీసీ బాలుర వసతి గృహాలు ఉన్నాయి. ఈ భవనాలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. బాలికల వసతి గృహాల్లో తలుపు లేని స్నానపు గదులు, శ్లాబు పెచ్చులూడిపడుతున్న భవనం వల్ల విద్యార్థినులు భీతిల్లుతున్నారు.

రిపేర్లకు అంచనాలు సిద్ధం



హాస్టల్ భవనాల రిపేర్లకు అంచనాలు సిద్ధం చేశాం. పొదలకూరు ఎస్సీ బాలికల హాస్టల్లో మరుగుదొడ్ల మరమ్మతులను వెంటనే చేయించాల్సిందిగా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చి ఉన్నారు. ఇదే హాస్టల్ నూతన భవన నిర్మాణానికి అంచనాలు రూపొందించారు. మిగిలిన భవనాలకు కూడా రిపేర్లు చేస్తాం.

– కె.బ్రహ్మానందచారి, ఇన్‌చార్జి ఏఎస్‌డబ్ల్యూఓ, పొదలకూరు



పొదలకూరులో నిద్రించే హాల్లో స్టడీ అవర్ నిర్వహణ



మనుబోలు ఎస్సీ బాలుర వసతిగృహంలో తలుపుల్లేని మరుగుదొడ్లు



ముత్తుకూరులో నేలపై భోజనం చేస్తున్న విద్యార్థినులు

77 మంది విద్యార్థుల హాజరు

వెంకటాచలం : విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శనివారం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలకు 77 మంది విద్యార్థులు హాజరయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. మొత్తం 82 మంది విద్యార్థులకు, 77 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారని తెలియజేశారు.

అయ్యప్పస్వామికి అంబళ్లపూజ



ఇషా టెంపుల్ సెట్టింగ్‌లో పూజలు

పొదలకూరు : పట్టణంలోని శ్రీరామ మందిరం వద్ద శివసాయి యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి అంబళ్లపూజను శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇషా టెంపుల్ సెట్టింగ్ నిర్మించి పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో భక్తులను ఆకట్టుకుంది. భజనలు, పాటలతో అయ్యప్ప భక్తులు తరించారు.

దుస్తుల పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం : సత్యసాయి బాబా జయంతి సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెం సుహాసిని నగర్‌కు చెందిన పోలిశెట్టి వినోద్‌బాబు శనివారం పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. బుచ్చిరెడ్డిపాళెంలోని కోదండరామస్వామి దేవస్థానం వద్ద, నెల్లూరు రంగనాథస్వామి ఆలయం, బస్ షెల్టర్లు, షాపులు, రోడ్ల పక్కన ఉండే పేదలకు దుస్తులు, వృద్ధులకు దుప్పట్లను అందజేశారు.

క్లుప్తంగా

ఆంగ్ల నైపుణ్యతపై శిక్షణ



కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు 'బ్రెయిన్ ఓ విజన్' సంస్థ ఆధ్వర్యంలో ఆంగ్ల భాషా నైపుణ్యతపై మూడ్రోజుల పాటు జరిగిన శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఇందులో విద్యార్థులకు వ్యక్తిగత వికాసం, సంభాషణ నైపుణ్యాలు, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై తర్ఫీదు ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం నుంచే విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చెందితే అన్నిరంగాల్లో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు, ఏఓ కె.గిరీష్‌కుమార్, అసోసియేట్ డీన్స్ పాల్గొన్నారు.

పల్లిపాడులో ఉచిత పశువైద్యశిబిరం



ఇందుకూరుపేట : పశుసంవర్థకశాఖ, స్వర్ణభారత్ ట్రస్ట్, మండవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పల్లిపాడులో ఉచిత పశువైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు ఉచితంగా వైద్యం అందించి, అవసరమైన మందులను పాడి రైతులకు అందజేశారు. ఏడీ డాక్టర్ మురళీకృష్ణ, ట్రస్ట్ డాక్టర్ శ్రీనివాసనాయుడు, ముదివర్తిపాళెం పశువైద్యాధికారి డాక్టర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా



సభ్యుల్లేక ఖాళీ కుర్చీల దర్శనం

ముత్తుకూరు : ముత్తుకూరు మేజర్ పంచాయతీ సర్వసభ్య సమావేశం శనివారం వాయిదా పడింది. సర్పంచ్ బూదూరు లక్ష్మి అధ్యక్షతన జరగాల్సిన సమావేశం కోరం లేక వాయిదా పడింది. పంచాయతీలో మొత్తం 16 మంది వార్డు సభ్యులకు కేవలం ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. ఉప సర్పంచ్ కూడా హాజరుకాలేదు. దీంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి జగదీష్ వెల్లడించారు.

పీహెచ్‌సీలో తనిఖీ



వైద్యసేవలపై ఆరా తీస్తున్న ఎంపీడీఓ

కొడవలూరు : మండలంలోని యల్లాయపాళెం పీహెచ్‌సీని ఎంపీడీఓ ఏవీ సుబ్బారావు శనివారం తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారికందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని రికార్డులను, రోగులకిచ్చే మందులను పరిశీలించారు. వైద్యశాలకు వచ్చే రోగులకు అన్నిరకాల వైద్య పరీక్షలు చేయాలని, ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని వైద్యాధికారి జనార్దన్‌రావుకు సూచించారు. ఆయన వెంట ఏఈఓ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మాల్యాద్రి, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన

ఇందుకూరుపేట : ఎన్‌సీసీ డేను పురస్కరించుకుని వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ఇందుకూరుపేటలోని చిన్మయ విద్యాలయంలో శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాలయ కరెస్పాండెంట్ బి.హరిత మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.బసివిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



జెడ్పీహైస్కూల్లో పోస్టర్లు చూపుతున్న సీడీపీఓ

పొదలకూరు : బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని ఇనుకుర్తి జెడ్పీహైస్కూల్లో బాల్యవివాహాలు, బాలికా విద్య, బ్యాడ్ టచ్, గుడ్‌టచ్, రక్తహీనత తదితర అంశాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికల లైంగిక వేధింపులను అరికట్టాల్సిందిగా సూచించారు. ఉమెన్ ట్రాఫికింగ్, గృహహింస, సఖి వన్‌స్టాప్ సెంటర్‌ల గురించి వివరించారు. చైల్డ్ అండ్ ఉమెన్ హెల్ప్‌లైన్ కోసం 1098181112 నంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు. చట్టాలపై అందరూ అవగాహన పెంపొందించుకోవాలని, బాల్య వివాహాలు జరుగుతుంటే అంగన్‌వాడీ టీచర్ దృష్టికి తీసుకు రావాల్సిందిగా కోరారు. సూపర్‌వైజర్లు జ్యోతిలక్ష్మి, ఆదినారాయణమ్మ, పద్మజ, సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ షహనవాజ్, సిబ్బంది శారద, లీలావతి పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిత



బుచ్చిరెడ్డిపాళెం : ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతోనే బంగారు భవిత సాధ్యమని ఎంఈఓ ఎం.దిలీప్‌కుమార్ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఎన్నారై వాసవి అసోసియేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన 'పుస్తక మిత్ర' గ్రంథాలయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ గంట పాటు పుస్తక పఠనం చేయడం వల్ల నిరంతర పరిశీలన, ఏకాగ్రత, విషయ పరిజ్ఞానం అలవడుతాయన్నారు. గ్రంథాలయ ఏర్పాటుకు సహకరించిన గండికోట సుధీర్‌కుమార్, మాల్యాద్రిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు వేదవతి, నిర్మల, వేణు, విజయకుమారి పాల్గొన్నారు.

చివరి మజిలీ నరకమే..



పొలాల నుంచి మృతదేహాన్ని మోసుకెళ్తున్న గ్రామస్తులు

విడవలూరు : మండలంలోని వరిణి పంచాయతీ వీరారెడ్డిపాళెం గ్రామానికి చెందిన గిరిజనులకు చివరి మజిలీ నరకప్రాయంగా మారింది. గ్రామంలో ఎవరైనా మరణిస్తే శ్మశానవాటికను వెళ్లేందుకు మార్గం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో శనివారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతిచెందడంతో అతని మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లేందుకు నానా కష్టాలు పడ్డారు. ఈ సమస్యను ఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదని గిరిజనులు వాపోతున్నారు. ఇదివరకు శ్మశానవాటికకు దారి ఉండేదని, ప్రస్తుతం దానిని కొందరు ఆక్రమించుకుని తమకు మార్గం లేకుండా చేశారని తెలియజేశారు. ఇకనైనా సంబంధిత అధికారులు, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ప్రతినిత్యం కార్తీక మాస పూజలు, ఆకాశ దీపం వెలిగిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

వెంకయ్యస్వామికి..



ప్రత్యేకాలంకరణలో వెంకయ్యస్వామి

మనుబోలు : మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామివారికి పంచామృతాభిషేకం జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వివాహం, సంతానం కోసం పలువురు హోమగుండం వేసి ధుని పూజ చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలకు మనుబోలు మోహన్‌రెడ్డి- పద్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

26న దేశవ్యాప్త ధర్నా

బుచ్చిరెడ్డిపాళెం : కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున తెలిపారు. ఈ మేరకు బుచ్చిరెడ్డిపాళెంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రైతుల ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను విరమించుకోవాలన్నారు. ట్రూ అప్ చార్జీలను రద్దు చేయమంటే ప్రభుత్వం కుంటిసాకులు చెప్పడం సబబు కాదన్నారు. ఈనెల 26వ తేదీన నెల్లూరు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ప్రదర్శన అనంతరం కలెక్టర్ కార్యాలయం వరకు ధర్నా జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న రైతులు, కార్మికులు, ప్రజా సంఘాల వారు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

'టంగుటూరు'కు కాకాణి నివాళి



నివాళులర్పిస్తున్న కాకాణి

తోటపల్లిగూడూరు : మండలంలోని ఈదూరుకు చెందిన సీనియర్ నాయకుడు, ప్రముఖ న్యాయవాది టంగుటూరు పెద్ద శ్రీనివాసులురెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. ఈ క్రమంలో ఈదూరులో ఆయన మృతదేహానికి మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ టంగుటూరు చిన్న శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ టంగుటూరు పద్మనాభరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మన్నెం చిరంజీవులగౌడ్, టంగుటూరు సురేష్‌రెడ్డి ఉన్నారు.

విడవలూరు విద్యార్థుల సత్తా



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ

విడవలూరు : నెల్లూరులోని డీకేడబ్ల్యూ కళాశాలలో శనివారం జరిగిన వివిధ రకాల ఆటల పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్లు విడవలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.సుజాత తెలియజేశారు. ఖోఖో, హ్యాండ్ బాల్, టగాఫ్ వార్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరచగా, అందులో తేజశ్రీ, హరిత సౌత్ జోన్‌కు ఎంపికైనట్లు తెలిపారు. విక్రమ సింహపురి ఇన్‌చార్జి వీసీ డాక్టర్ ఎస్.విజయభాస్కర్ విద్యార్థులను అభినందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్పోర్ట్స్ కన్వీనర్ డాక్టర్ ఏవీ ప్రసాద్, మెంబర్ ఎం.వెంకటరమణరావు, డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.

మేమింతే.. మారమంతే..



నరుకూరు సెంటర్‌లో బైక్‌పై నలుగురి ప్రయాణం

తోటపల్లిగూడూరు : టూ వీలర్‌లో ఇద్దరు మాత్రమే ప్రయాణించాలి. ఇది ప్రభుత్వ నిబంధన మాత్రమే కాదు.. వాహనదారులకు ఇదే క్షేమం. అయితే వీటిని పక్కన పెట్టి కొందరు తమ మోటారు బైకుల్లో ముగ్గురు, నలుగురితో ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా యువకులు ఈ రకమైన ప్రయాణాలను అధికంగా సాగిస్తున్నారు. ఎక్కువ మందితో ప్రయాణాలు చేయడం వల్ల వాహనం నడిపే వ్యక్తికి కూడా పట్టు లేకుండా ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఓ వైపు మితిమీరిన వేగం, మరో వైపు పరిమితికి మించి బైక్‌పై ప్రయాణాలు సాగించడంతోనే రోడ్డు ప్రమాదాలు తరచూ చోటుచేసుకొంటున్నాయి. ఈ క్రమంలోనే నరుకూరు సెంటర్‌లో శనివారం ఓ మోటారు బైక్‌పై నలుగురు యువకులు హల్‌చల్ చేస్తూ స్థానికులను భయాందోళనలకు గురిచేశారు.

హడలెత్తిస్తోన్న ప్రధాన రహదారి



కట్టుబడిపాళెం వద్ద రోడ్డు దుస్థితి

బుచ్చిరెడ్డిపాళెం : రెండు మండలాలకు ప్రధానమైన దగదర్తి– బుచ్చిరెడ్డిపాళెం రోడ్డు ప్రజలను హడలెత్తిస్తోంది. నిధులుండి పనులు కాకపోవడంతో వాహనదారులు ఇబ్బందుల నడుమ ప్రయాణాలు సాగిస్తున్నారు. ఎన్‌డీబీ కింద రూ.29 కోట్లతో 2022లో రోడ్డు మంజూరైంది. అయితే కాంట్రాక్టర్, అధికారులకు మధ్య ఏర్పడిన వివాదం ప్రజల పాలిట శాపంగా మారింది. ఈ నిధుల కింద గ్రామ పరిధిలో ఉన్న రోడ్లను మాత్రం సిమెంటు రోడ్లుగా మార్చారు. మిగిలిన చోట్ల తారు రోడ్డు వేయాల్సి ఉంది. కానీ క్వాలిటీ కంట్రోల్ అధికారులు రాకపోవడంతో బిల్లులు పేరుకుపోయి కాంట్రాక్టర్ పనులను నిలుపుదల చేశారు. ఇప్పటికే తాము రూ.10 కోట్ల వరకు పనులు చేశామని, బిల్లులు విడుదల చేస్తే మిగిలిన పనులు చేసేందుకు సిద్ధమని కాంట్రాక్టర్ స్పష్టం చేసినట్లు తెలిసింది. కాగా కాంట్రాక్టర్ అల్లూరు కాలువపై కట్టిన వంతెన ప్రారంభానికి ముందే పగుళ్లు ఏర్పడడం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు మొత్తం ఛిద్రమై వాహనదారులకు నరకం కనిపిస్తోంది.



రామచంద్రాపురం వద్ద గుంతలమయంగా రోడ్డు



అల్లూరు కాలువపై నిర్మించిన వంతెనకు బీటలు